క్లుప్తంగా

14 పంచాయతీల్లో బూడి, అనురాధ ప్రచారం నేడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ మంగళవారం 14 పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. ములకలాపల్లిలో ఉదయం 7:30 గంటలకు ప్రారంభమై కొత్తపెంటలో 8:00కు, ఎస్.గజపతినగరంలో 8:45, ఎం.అలమండలో 09:30, చిన నందిపల్లి 10:10లో, గరిశింగి పంచాయతీ శివారు చినగంగవరం, చింతలపాలెం, వేలం బయలు, రేగుల బంద, సంతపాలెం, తాటిపూడిలో 10:40కు, తెనుగుపూడి పంచాయతీ విసారపు వీధి, రొంగలి పేట, గొల్లవీధిలో మధ్యాహ్నం 12:00, గరిశింగి పంచాయతీలో కొత్తూరు, డొర్రు చెరువు, గరిశింగిలో 12:30కు, తెనుగుపూడిలో 1:00కు, వెంకటరాజుపురంలో 1:30 గంటలకు ప్రచారం నిర్వహిస్తామన్నారు. వెంకటరాజుపురంలో మధ్యాహ్న భోజన విరామం తీసుకుంటారన్నారు. వాకపల్లిలో సాయంత్రం 4:00, తిమిరాంలో 5:00, కలిగొట్లలో 5:30కు, బోయిలకింతాడలో 6:00కు, వేచలంలో 7:00కు, మామిడిపల్లిలో 8:00 గంటల ప్రాంతంలో ప్రచారం చేస్తారన్నారు. ఆయా గ్రామాల్లో స్థానిక పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

కె.జె.పురం గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా లేఖలను సచివాలయ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

మాడుగుల రూరల్: కె.జె.పురం మేజర్ గ్రామ పంచాయతీలో ముగ్గురు గ్రామ వలంటీర్లు సోమవారం తన బాధ్యతలకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను సచివాలయ కార్యదర్శి ప్రవీణ్‌కు అందజేశారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈర్లె అనురాధ, బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

కె.కోటపాడు: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సోమవారం పాదపూజ చేశారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వారోత్సవాల సందర్భంగా స్థానిక రామాలయంలో పాదపూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మండల సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాలకు చెందిన బాలవికాస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. జె.భీమేష్ సహాయ సహకారాలందించారు.

జూనియర్ కళాశాల నిర్వహణకు అనుమతులు



కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు పై ప్రచారం

ఎస్.రాయవరం : కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల నిర్వహణకు అనుమతులు వచ్చాయని ప్రధానోపాధ్యాయులు సకురు సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలో అదనపు జూనియర్ కళాశాలలు మంజూరు భాగంగా ఎస్.రాయవరం మండలానికి కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో కళాశాల నిర్వహించేందుకు అనుమతులు వచ్చాయన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. మొదటి ఏడాది ఎంపీసీ, బైపీసీ గ్రూపులతో కళాశాల నిర్వాహణ ఉంటుందన్నారు. జూన్ మొదటి నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో కళాశాల ఏర్పాటు ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కొందరు విద్యార్థులకు అడ్మిషన్లు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కళాశాల అడ్మిషన్ల క్యాంపెయిన్ కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

గొడుగుల పంపిణీ

మునగపాక: స్థానిక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో మునగపాక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు గొడుగులు పంపిణీ చేశారు. వ్యాపార వేత్త ఆడారి అప్పలనాయుడు చేతులమీదుగా వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలంక సూర్యప్రకాశరావు, కింతాడ మోహనరావు, దాడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

డెవలప్‌మెంట్ వాచ్

ప్ర'జల' కష్టాలకు చెక్



రోలుగుంట మండలం గదబపాలెం గిరిజన గ్రామంలో 10 కెఎల్ తాటునీటి పథకం



రావికమతం మండలం ధర్మవరం వద్ద సర్పానదిలో ఏర్పాటు చేసిన భారీ బావిలో అమర్చిన బాహుబలి మోటార్లు



రావికమతం మండలం ప్రకాష్‌నగర్ వద్ద నిర్మించిన నూతన మంచినీటి ట్యాంకు

రావికమతం/రోలుగుంట/కె.కోటపాడు: దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక శాశ్వతంగా పరిష్కరించింది. తాగునీటి కోసం తెల్లవారే మహిళలు ఇంటి నుంచి అడుగు పెట్టే రోజులు పోయాయి. వేసవిలో సైతం తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జల జీవన్ మిషన్ నిధులతో ట్యాంకులు నిర్మించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తోంది. చోడవరం, మాడుగుల నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనే ఇంటింటికి నీటి సరఫరా అవుతోంది.

శాశ్వతంగా పరిష్కరించిన గ్రామాల్లో కొన్ని..

రావికమతం మండలం కొత్తకోట మేజర్ పంచాయతీలో 30 ఏళ్లుగా నెలకొన్న మంచినిటి ఇబ్బందులు తొలగాయి. ఇరవై వేల జనాభా కలిగిన గ్రామంలో ఎక్కడ బోరు వేసినా ఉప్పునీరు వస్తోంది. దీంతో రూ.7.68 కోట్లతో ధర్మవరం వద్ద సర్పానదిలో 40 అడుగుల మేర భారీ బావి తీసి బాహుబలి మోటార్లు అమర్చారు. అక్కడి నుంచి గ్రామానికి పైపుల ద్వారా నీటిని తరలించి ఇంటింటి కుళాయి నీరు ఇస్తున్నారు.

- రోలుగుంట మండలంలో అర్ల గిరిజన పంచాయతీ శివారు గ్రామం గదబపాలేనికి రూ.20 లక్షలతో పైపులైను, ఇంటింటా కుళాయి ఏర్పాటుతోపాటు 10 వేల లీటర్ల ట్యాంకును నిర్మించారు. 350 మందికి తాగునీటి సమస్య తీర్చారు.
- కె.కోటపాడు మండలం కింతాడ పంచాయతీ శివారు బొట్టవానిపాలెంలో దశాబ్దాలుగా చేతిబోర్లపైనే ఆధారడేవారు. ఇక్కడ 500 మంది జనాభాకు రూ.30 లక్షలతో 10 వేల లీటర్ల మంచినీటి ట్యాంకు నిర్మించి ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు.



కె.కోటపాడు మండలం బొట్టవానిపాలెంలో మంచినీటి పథకం ట్యాంకు

సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



కుసుర్లపడిలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, కార్యకర్తలు



రత్నంపేటలో ప్రచారం చేస్తున్న మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు

రోలుగుంట: సంక్షేమాల అమలు, వలంటీర్ల సేవలు తిరిగి కొనసాగాలన్నా, నాణ్యమైన విద్య అందాలన్నా వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని కుసర్లపూడి సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, రత్నంపేట మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు అన్నారు. చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు గెలుపు కోసం ఆయా గ్రామాల వీధుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా తిరిగి సంక్షేమాల అమలు, వలంటీర్ల సేవలతో ప్రజలకు జరిగే మేలు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పైసా ఖర్చు లేకుండా అందుతున్న విద్య, వైద్య, తదితర సేవల గురించి వివరించారు. మరలా మన ప్రభుత్వం వచ్చాక ఇంటి వద్దకే పింఛన్లు సొమ్ము అందిస్తారన్నారు. వీటిని గమనంలో ఉంచుకుని రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి మోసాల చంద్రబాబుని, ఒక లక్ష్యం లేని పవన్ కల్యాణ్‌ను శాశ్వతంగా ఇంటికి పంపాలని కోరారు. కంచుగుమల, కొమరవోలు, కె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో స్థానిక నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

దోపిడీదారు బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

- 10 ఏళ్లలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజు చేసిన అభివృద్ధి శూన్యం
- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి కిశోర్‌కుమార్



చోడవరంలో విలేకరుల సమావేశంలో ఆడారి కిశోర్‌కుమార్

చోడవరం: రాయలసీమలో వార్డు మెంబరుగా గెలవలేని సీఎం రమేష్ మన ప్రాంతాన్ని దోపిడీ చేయాలని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి కిశోర్‌కుమార్ ధ్వజమెత్తారు. చోడవరం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కడప దందా చేసి ప్రశాంతంగా ఉన్న అనకాపల్లిని రాయలసీమగా తయారు చేయాలనే ఇప్పటి వరకూ బీజేపీ ఎంపీ అభ్యర్థి చేస్తున్న దౌర్జన్యాలు చెప్పకనే చెబుతున్నాయన్నారు. దీనిలో భాగంగానే చోడవరం గాంధీగ్రామంలో ఓ షాపుపై జీఎస్టీ అధికారులు తనిఖీలు చేస్తుంటే, వారిపై దౌర్జన్యానికి దిగారన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ఇంటిపై దాడికి ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ప్రజా స్వామ్యంపై దాడి చేస్తున్న ఇలాంటి వ్యక్తిపై ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని కోరారు. చోడవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.ఎస్.ఎన్.ఎస్ రాజు రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసి నియోజవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, నియోజకవర్గ ప్రతినిధి శరగడం చిమ్మినాయుడు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే ప్రతీ కుటుంబానికి మేలు

చౌడువాడలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీరాజు ప్రచారం



ఎన్నికల ప్రచారంలో శివాజీరాజు, తదితరులు

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి మేలు కలిగినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీ రాజు అన్నారు. సోమవారం చౌడువాడలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధలకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మంచి చేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వాన్ని మరలా రెండోసారి ఆశీర్వదించాలని కోరారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయిప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజి శ్రీను, సచివాలయ కన్వీనర్ వారాధి అప్పారావు, చల్లా సురేష్, రాపేటి అప్పలతాత పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి, పక్కన వైస్ ఎంపీపీలు బుల్లిలక్ష్మి, గంగాభవానీ

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉర్రూకుల గంగా భవానీ హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అభివృద్ధిపై సమీక్షలు లేకుండానే ముగించారు. ప్రధానంగా మంచినీరు, విద్యుత్ తదితర ప్రాధాన్యత సమస్యలు ఉంటే చెప్పాలని ఎంపీడీవో కోరగా, ఎవరూ స్పందించక పోవడంతో కొద్ది సేపటి తర్వాత సమావేశాన్ని ముగించారు. ఎంపీపీ పదవికి కిలపర్తి రాజేశ్వరి ఇటీవల రాజీనామా చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో అధ్యక్షతన సమావేశా న్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి జి.వి.రమణ, ఎంపీటీసీలు పోతల వెంకటరావు, బండి గౌరమ్మ, గంధం రామకృష్ణ, చిరికి లక్ష్మీ, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్ గెలిస్తే పింఛన్ సొమ్ము ఇంటికే..

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ



చినమదీనలో విజయం మనదే.. కీర్తి కిరీటం మనదే అని విప్ ధర్మశ్రీని సత్కరిస్తున్న గ్రామస్తులు



పోలేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: పింఛన్ నగదు ఒకటో తేదీన మీ ఇంటికే రావాలంటే మరలా ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలని చోడవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ తెలిపారు. సోమవారం పోలేపల్లి, గున్నెంపూడి, పెదమదీన, చినమదీన, గొన్నవానిపాలెం, కొత్త కందిపూడి, పాత కందిపూడి, కొండకుమ్మర, పి. భీమవరం, పొట్టిదొరపాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్.బి.పురం గ్రామాల్లో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలతో వలంటీర్ల ద్వారా పింఛన్లు అదకుండా చేయడంతో లక్షలాది మంది పింఛన్‌దారులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కరోనా కష్టకాలంలోనూ సీఎం జగనన్న మాత్రం సంక్షేమ కార్యక్రమాలు ఆపకుండా ప్రతి ఇంటికి రెండు నుంచి ఐదు లక్షల లబ్ధి చేకూర్చారన్నారు. 14 ఏళ్లు పాలించిన చంద్రబాబునాయుడు ప్రజల కోసం ఒక్క సంక్షేమ పథకమైన అందించారా అని ప్రశ్నించారు. డ్వాక్రా, రైతు రుణ మాఫీ చేయకుండా ఇంటికొక ఉద్యోగం, నెలకు రెండు వేల నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఇప్పుడు నాల్గో విడత ఆసరా, చేయూత నగదు రాకుండా అడ్డుకున్న టీడీపీ నాయకులకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా, హెల్త్ సెంటర్, నాడు – నేడు పనులతో పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. మీకు మీ కుటుంబాలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పలు గ్రామాల్లో ప్రజలు తెలిపిన తాగునీరు, కాలువలు, కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు చేస్తామన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చిన బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు సీతా బుజ్జి, ముచ్చకర్ల అప్పారావు, కె. వెంకటరావు, పచ్చికూర గోవింద, జోగా కొండబాబు, అప్పలనాయుడు, గణేష్, రామునాయుడు, తమరాన శ్రీను, గుద్దేటి శ్రీను, ఆర్టీసీ రమణ, మేరుగు బాబూరావు, శిరిగిరిశెట్టి నానాజీ, సాయం రమేష్, గుడాల ఆనంద్, దొండా రాజా, కుమార్, శ్రీను పాల్గొన్నారు.



గున్నెంపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ

వైఎస్సార్‌సీపీ హయాంలో గిరి గ్రామాల అభివృద్ధి

- మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ
- 24 గిరిజన గ్రామాల్లో మండుటెండలోనూ ఎన్నికల ప్రచారం
- ప్రతి గ్రామంలో ఘన స్వాగతం



శంకరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ



కొత్తవలసలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



లక్ష్మింపేటలో అనురాధను ఆశీర్వదిస్తున్న మహిళలు

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయని మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. మండలంలో శంకరం, తాటిపర్తి, ఎం.కోడూరు గ్రామాల్లో సోమవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మండుటెండను సైతం లెక్క చెయ్యకుండా గిరి శివారు గ్రామాలైన కొత్తవలస, వెలంపాడు, తాడివలస, రాజంపేట, రాయిపాలెం, కృష్ణంపాలెం, మునిపల్లి, సూర్యనారాయ ణపురం, చుట్టిగెడ్డ, మామిడిపాలెం, రామచంద్రపురం, బొడ్డరేవు, తాటిపర్తి పంచాయతీ శివారు పది గ్రామాల్లో ఇంటింటికీ తిరిగారు. మండుటెండను సైతం లెక్క చెయ్యకుండా పర్యటించారు. ప్రతి గ్రామంలో మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గిరి గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించామని, మిగిలిన సమస్యలు పరిష్కారానికి తాను గెలిచిన వెంటనే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను మీ బిడ్డగా ఆశీర్వదించి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తన తండ్రి బూడి ముత్యాలనాయుడును ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పార్టీలకతీతంగా నిరుపేదల సంక్షేమంతోపాటు అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన అజెండాగా నిరంతరం పనిచేస్తున్నారన్నారు. శంకరం, తాటిపర్తి. పంచాయతీల్లో శివారు గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మించారన్నారు. బొడ్డరేవు లాంటి చిన్న గ్రామానికి రూ.1.10 కోట్లతో సీసీ రోడ్డు నిర్మించారన్నారు. వైఎస్సార్ చేయూత నగదును మహిళలు బ్యాంకు ఖాతాలో వెయ్యకుండా మాజీ సీఎం చంద్రబాబు అడ్డుకున్నారని, పింఛన్లను వలంటీర్లుతో పంపిణీ కాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, మాడుగుల ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, శంకరం, తాటిపర్తి, ఎం. కోడూరు, మాడుగుల, కె.జె.పురం, ముకుందపురం సర్పంచ్‌లు శోలం రమేష్, అల్లంగి వెంకటగౌరీదేవి, గొల్లవిల్లి సంజీవిరావు, యడ్ల కళావతి, జామి రమణబాబు, కర్రి గణేష్, పార్టీ నాయకులు కోట్ని శ్రీరామూర్తి, ఆడారి కన్నారావు, బోగాది శంకరరావు, దొండా నాగమణి, కోరుకొండ చెల్లంనాయుడు, సయ్యపురెడ్డి నారాయణరావు, శీరా సన్యెమ్మ, పరిమి కాసుల జగ్గారావు, పెద్దాడ లక్ష్మణరావు, పాము వెంకట్రావు, అల్లంగి సంజీవ్, శీరా తలుపునాయుడు, కాతా రమణ, పడాల అప్పలనాయుడు, కర్రి నాయుడుబాబు, వెలగాడ ఈశ్వరరావు, యన్నంశెట్టి వెంకటరమణ, పెంటకోట అప్పారావు, ఆడారి భాస్కరరావు, భీశెట్టి జగ్గప్పారావు, శంకర్, గోవిందరాజులు, స్థానిక నాయకులు ఈశ్వరరావు, రక్షకుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

- మాడుగులలో తొలి రోజు 31 శాతం పోలింగ్



మాడుగుల పాఠశాల కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు



చోడవరంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగిస్తున్న ఉద్యోగులు

మాడుగుల రూరల్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ సోమవారం స్థానిక ఆర్సీఎం బాలికల పాఠశాలలో ప్రారంభమైంది. మాడుగుల నియోజకవర్గంలో 2,372 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గాను సోమవారం 735 మంది ఓటు వేసినట్లు ఆర్వో జి.వి. సత్యవాణి తెలిపారు. ఈ నెల 7,8 తేదీల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ కొనసాగనుందన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచామన్నారు.

చోడవరంలో 925 మంది పోస్టల్ బ్యాలెట్ వేసిన ఉద్యోగులు

చోడవరం: నియోజకవర్గంలో మొదటి రోజు పోస్టల్ బ్యాలెట్‌లో 925 మంది ఉద్యోగులు సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2,426 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా, మొదటి రోజు 925 మంది ఓటువేశారు. ఇక్కడ హెల్ప్‌డెస్క్ పెట్టినప్పటికీ ఇబ్బంది పడ్డారు. హెల్ప్ డెస్క్‌లో ఉన్న నంబర్‌కు లోపల నంబర్‌కు తేడా రావడంతో ఓటు వేసేందుకు గందరగోళానికి గురయ్యారు. ఆ సమయంలో ఆర్వో చిన్నికృష్ణ సమస్యను పరిష్కరించారు. మంగళవారం నుంచి ఆ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.